లీడర్ 7
సంచలన వారపత్రిక
విశాఖపట్నం,
గురువారం, 10 డిసెంబర్, 2009

గమనిక

అనకాపల్లి లీడర్ ప్రాంతీయ కార్యాలయంనకు సంబంధించిన సెల్ ఫోన్ నెంబరు మారింది. కొత్త నెం. 9246608246 గా గుర్తించగలరు.

ఫలించిన కార్మికుల పోరాటం

విజయనగరం, డిసెంబర్ 9(న్యూస్‌లీడర్): గత నెల నుంచి 12 కార్మిక సంఘాలు ఎపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో జెకె సతీక్రియేషన్స్ ఉద్యోగుల కోసం కొనసాగిస్తున్న కార్మికుల రిలే నిరాహారదీక్షల పోరాటం ఫలించింది. ఒక ప్రముఖ వస్త్రాలయంలో, షాపులు సంస్థల్లో కార్మిక చట్టబద్ధమైన కార్మిక హక్కులు కాలరాస్తున్నా జిల్లా కార్మిక అధికారులు పట్టించుకోవడం లేదని, కార్మిక చట్టాలు అమలు కోసం ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడం లేదని, కార్మికులకు రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వడంలేదనే పలు డిమాండ్‌లతో కార్మికులు చేస్తున్న నిరసన కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ జి.రామనారాయణరెడ్డి స్పందించి జిల్లా కార్మికశాఖాధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కార్మికశాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ జనార్ధనరావు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రామకృష్ణమూర్తి నాయకత్వంలో కార్మికశాఖ సిబ్బంది చట్టపరమైన చర్యలను ప్రారంభించింది. గత నెల 26వ తేదీన స్ప్రాడు తనిఖీ జరిపి 79 మంది కార్మికులకు కనీస వేతనాలు కన్నా తక్కువ ఇస్తున్నట్లు గుర్తించి , 5,40,809రూపాయలకు విశాఖ జాయింట్ లేబర్ కమిషనర్ వద్ద క్లయిమ్‌లు దాఖలు చేశారు. ఉద్యోగ నియామక పత్రాలకై యాజమాన్యాలకు షోకాజ్ నోటీస్‌ను 7 రోజుల కాలపరిమితి విధించి జారీ చేశారు. ఎపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో 12 కార్మిక వృత్తి సంఘాల ఆందోళన ఫలితంగా యూనియన్‌లో సభ్యులు కానటువంటి వారికి కూడా ఉన్న జీతాలపై నెలకు 1000 నుంచి 1500 రూపాయిలకు వరకు పెంచారు. 8 గంటల పని అమలుకై తగు చట్ట పరమైన చర్యలను తీసుకుంటామని లేబర్ అధికారు హామీ ఇచ్చారు.

హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం :ఎపిఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఆందోళన విరమణ సందర్భంగా 12 కార్మిక సంఘాల కార్యకర్తల సమావేశం శిబిరం వద్ద జరిగింది. గాదిపల్లి శ్రీనివాస రావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో కార్మిక నేతలు మాట్లాడుతూ సమైక్యంగా సంఘటిత శక్తితో పోరాడితే సమస్యలను పరిష్కరించు కోవచ్చని ఈ ఆందోళన రుజువు చేసిందన్నారు. ఈ సమావేశంలో బి.శంకరరావు, కె.పైడిరాజు, కె.పాపారావు, ఆర్.ఈశ్వరరావు, కె.పైడిచిట్టి, కంది త్రినాథరావు, ఎన్.అప్పల రాజురెడ్డి, జి.పెంటయ్య, సి.హెచ్.రాము నాయుడు, జి.శంకరరావు, మద్ది అప్పలరాజు పాల్గొన్నారు.

సీఎం విజయనగరం పర్యటన రద్దు

విజయనగరం, డిసెంబర్ 9(న్యూస్‌లీడర్): రాష్ట్ర ముఖ్యమంత్రి కొణజేటి రోశయ్య పర్యటన విజయనగరం పట్టణంలో లేదని డిసిసి ఇన్‌ఛార్జి కోలగట్ల వీరభద్రస్వామి వెల్లడించారు. బుధవారం ఉదయం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిఎం పర్యటనా వివరాలను ఆయన తెలిపారు. అనుకున్న విధంగా ఈ నెల 12న జిల్లా పర్యటకు వస్తారని అయితే బొబ్బిలిలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు, పూసపాటిరేగలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి రోశయ్య హాజరవుతారని తెలిపారు. అనివార్య కారణాల వలన పట్టణంలో సిఎం పర్యటనను రద్దు చేసినట్లు తెలిసిందని, త్వరలో పూర్తి వివరాలు అందజేస్తామన్నారు. వై.ఎస్.ఆర్.నగర్, జెఎన్‌టియు, డిసిసి నూతన కార్యాలయం వంటి కార్యక్రమాల్లో రోశయ్య పాల్గొనాల్సి ఉందని కోలగట్ల తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధికార ప్రతినిధి యడ్ల ఆదిరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రొంగలిపోతన్న తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని రూపుమాపడమే ధ్యేయం

విజయనగరం, డిసెంబర్ 9(న్యూస్‌లీడర్): సమాజాన్ని చిన్నాభిన్నం చేస్తున్న అవినీతిని నిర్మూలించడమే లోక్‌సత్తా పార్టీ అజెండా అని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా కన్వీనర్ బీశెట్టి బాబ్జీ అన్నారు. ప్రపంచ అవినీతి నిర్మూలన దినోత్సవం సందర్భంగా పట్టణంలో పార్టీ నిర్వహించిన ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల వల్ల సామాన్యుడు బతకడానికి నానా ఇబ్బందులు పడుతుంటే అవినీతి మరింత దుర్భర జీవితంలోకి నెట్టేస్తుందని అన్నారు. మంచి పాలనను ప్రజలకు అందించడమే తమ పార్టీ థ్యేయమని ఆ దిశగా కృషిచేస్తున్నామన్నారు. కాంప్లెక్స్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీలో మయూరీ జంక్షన్ వరకు సాగింది. అనంతరం అవినీతి దిష్టిబొమ్మను

దగ్ధం చేశారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు అనంతలక్ష్మి, సుభద్రమ్మ, శివరామారావు, భాస్కర్, డానియల్, పాకలపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలిక హత్యకు బాధ్యులైన వారిని

కఠినంగా శిక్షించాలి

అనకాపల్లి, డిసెంబర్ 9 (న్యూస్‌లీడర్): మండలంలోని సత్యనారాయణపురం శివారు సుబ్రహ్మణ్యం కాలనీని చెందిన గిరిజన బాలిక గౌరీపై అత్యాచారం చేసి అనంతరం ఆమెను హత్య చేసిన సంఘటనలో బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ అనకాపల్లిలో బహుజన హక్కుల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ జరిగింది. సుబ్రహ్మణ్యం కాలనీ నుంచి ప్రదర్శన ప్రారంభమైంది. దళితులపై దాడులు నశించాలని, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని అమలు చేయాలని, టివీ, సినిమాల్లో అశ్లీల దృశ్యాలను నిర్మూలించాలని, మహిళలకు రక్షణ కల్పించాలని, గౌరీ కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సంఘం జిల్లా కన్వీనర్ ఎగ్గాడ భాస్కర రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. ర్యాలీ అనంతరం స్థానిక నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడి రాస్తారోకో నిర్వహించారు. దీనిని ఉద్దేశించి పలు ప్రజాసంఘాల ప్రతినిధులు మాట్లాడారు. ఎగ్గాడ భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సభలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎం.లక్ష్మీ మాట్లాడుతూ చట్టాలను అమలు చేయవలసిన పోలీసులు వాటిని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. సాక్షి హ్యూమన్‌రైట్స్ వాచ్ జిల్లా కో-ఆర్డినేటర్ కె.కుసుమ మాట్లాడుతూ గౌరీ కేసులో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని ఉద్దేశపూర్వకంగానే పోలీసులు అమలు చేయడం లేదని ఆరోపించారు. దళిత బహుజన శ్రామిక యూనియన్ (ఎపి) జిల్లా కన్వీనర్ మరి పల్లి శోభ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. మహిళా హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షురాలు నిమిడితల్లి ఈశ్వరి, ఎరుకుల హక్కుల పోరాట సమితి మండల కన్వీనర్ పూజారి నరసయ్య, ఎంఆర్‌పిఎస్ కన్వీనర్ గంట్యాడ సత్తిబాబు , స్వామి నాగేశ్వరరావు, నునపర్తి శివ, ఎస్‌వి రమణ, తదితరులు మాట్లాడారు.

13న పూర్వ విద్యార్థుల సమావేశం

అనకాపల్లి, డిసెంబర్ 9 (న్యూస్‌లీడర్): స్థానిక గవరపాలెం మున్సిపల్ హైస్కూల్‌లో 1983-84లో పదవతరగతి చదివిన విద్యార్థుల సర్వసభ్య సమావేశం ఇదే స్కూల్‌లో ఆదివారం సాయంత్రం మూడు గంటలకు జరుగుతుంది. ఈ విషయాన్ని కన్వీనర్ పి.వి.సత్యనారాయణ, ఎ.వి. సూరి అప్పారావులు తెలిపారు. ఆ ఏడాది ఈ స్కూల్‌లో పదవతరగతి చదివిన విద్యార్థులంతా హాజరుకావాలని కోరారు.

ఇనుప ఖనిజాన్ని

విశాఖకు తరలించాలి

గాజువాక, డిసెంబర్ 9(న్యూస్‌లీడర్): ఆంధ్రరాష్ట్రంలో ఇనుప ఖనిజాన్ని విశాఖకు కేటాయించాలని కోరుతూ బుధవారం స్టీల్ ప్లాంట్ ట్రైనింగ్ సెంటర్ వద్ద సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సిటు అఖిలభారత అధ్యక్షులు ఎంకె పాండే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనుల సాధన కోసం భవిష్యత్ పోరాటాల దిశగా కార్మికులను చైతన్యం చేయడమే సదస్సు ఉద్దేశమన్నారు. కేంద్ర ప్రభుత్వం మైనింగ్ పాలసీని సక్రమంగా పాటించకపోవడం వల్ల రాష్ట్రంలో ఉన్న గనులు దుర్వినియోగమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో అనేక చోట్ల ఇనుప ఖనిజాలు ఉన్నప్పటికీ ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి ఉక్కు పరిశ్రమల మనుగడకు కార్మికుల శ్రేయస్సుకు తోడ్పాడలని డిమాండ్ చేశారు. ఈకార్య క్రమంలో జిల్లా అధ్యక్షులు అజయ్‌శర్మ, సిటు అధ్యక్షులు అయోధ్యారామ్, గురప్ప, ధనరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో

విశాఖకు గుర్తింపు తెస్తా

గాజువాక, డిసెంబర్ 9(న్యూస్‌లీడర్): జాతీయస్థాయిలో విశాఖకు గుర్తింపు తేస్తానని మేయర్ పులుసు జరనార్దనరావు అన్నారు. బుధవారం గాజువాక వికాస్‌నగర్‌లో వర్తక సంఘ అధ్యక్షులు తిప్పల చినఅప్పారావు ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చినఅప్పారావు మాట్లాడుతూ భవిష్యత్‌లో అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకోనున్న దిశగా విశాఖను తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘ సభ్యులు పి.టి.ఎస్.నాగేశ్వరరావు, బొగ్గారపు వెంకటేశ్వర్లు, పూసర్ల వెంకటేశ్వరరావు, ఉప్పు సత్యనారాయణ, విశ్వేశ్వరరావు, బుచ్చి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి జి.వి.ఎం.సి.ద్వారా నగర మేయర్ పులుసు జనార్ధనరావు చేసిన విశిష్ట సేవలకు ప్రధాని మన్మోహన్‌సింగ్ చేతుల మీదుగా నాలుగు లక్షల రూపాయలు నగదు పురస్కారం, అవార్డు అందుకున్న శుభ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ

నలుగురికి గాయాలు

అనకాపల్లి, డిసెంబర్ 9 (న్యూస్‌లీడర్): అనకాపల్లి-విశాఖ జాతీయ రహదారిపై కొప్పాక బ్రిడ్జి వద్ద బుధవారం రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అగనంపూడికి చెందిన మళ్ల ధర్మతేజ(7), ఎం.నవ్యకళ్యాణి(9) అను ఇద్దరు తుమ్మపాలలోని తమ బంధువుల ఇంటికి వచ్చారు. వారి బంధువు పువ్వుల రమేష్(34) మోటార్ సైకిల్‌పై ధర్మతేజ, కల్యాణిలను అగనంపూడికి తీసుకువెళ్తున్నాడు. కొప్పాక బ్రిడ్జి వద్దకు వారు చేరుకోగా వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన మరొక్క మోటార్ సైకిల్ వారిని ఢీకొంది. దీంతో రెండు మోటారు సైకిళ్లు బోల్తా పడ్డాయి. ఈ సంఘటనల్లో రమేష్, ధర్మతేజ, కల్యాణిలతో పాటు వెనుక నుంచి వచ్చిన మోటర్ సైకిల్ నడుపుతున్న కర్రి గగన్ సాయి(20)లు తీవ్రంగా గాయపడ్డారు. వీరందరినీ 108లో చికిత్స నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గగన్ సాయి స్థానిక సత్యనారాయణ ఐ.టి.ఐలో చదువుతున్నాడు. ఈయన గవరపాలానికి చెందినవాడిగా గుర్తించారు.

ఆటో బోల్తా

ఒకరికి గాయాలు

అనకాపల్లిఅర్బన్, డిసెంబర్ 9 (న్యూస్‌లీడర్): తుమ్మపాల వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటో నడుపుతున్న బొద్దంపూడి గణేష్(26) తీవ్రంగా గాయపడ్డాడు. ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే ప్రయత్నంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ గణేష్‌ను 108లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గణేష్ మునగపాక మండలం ఉమ్మలాడ గ్రామానికి చెందినవాడు.

కార్మికుల పిల్లలకు

స్కాలర్‌షిప్పులు

అనకాపల్లి, డిసెంబర్ 9 (న్యూస్‌లీడర్): స్థానిక ఎన్టీఆర్ మార్కెట్‌యార్డులోని అనకాపల్లి గాంధీమార్కెట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన సభలో సంఘం కార్మికుల పిల్లలు 33 మందికి ఒక్కొక్కరికి రూ. 12వందల చొప్పున రూ. 39,600ను స్కాలర్‌షిపులుగా పంపిణీ చేశారు. ఎల్‌ఐసి విశాఖ డివిజనల్ మేనేజర్ బిఎ రాతా, బ్రాంచ్ మేనేజర్ పి. చంద్రశేఖర్‌ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. సభకు సంఘం అధ్యక్షుడు బుద్ద నూకరాజు అధ్యక్షత వహించారు. కార్యదర్శి పాలిమేర శివ అప్పారావు (మణి) మాట్లాడుతూ తమ సంఘ సభ్యులు ఎవరైనా మరణిస్తే రూ. 30వేలు ను ఎల్‌ఐసి ద్వారా అందజేస్తున్నామని చెప్పారు. స్కాలర్‌షిప్‌లను పొందిన విద్యార్థుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటున్నామని చెప్పారు. గతంలో ఇటువంటి పథకాలు అందుబాటులో లేని కారణంగా తమ సంఘంలోని కార్మికుల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడి వారి పిల్లలను ఉన్నత చదువులను చదివించుకోలేకపోయారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల రాము, పీలా నాగేశ్వరరావు, బుద్ద రాము తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో

విధులకు టీచర్లు

విజయనగరం, డిసెంబర్ 9(న్యూస్‌లీడర్): విద్యారంగ సమస్యల పరిష్కారానికై దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్య క్రమాలలో భాగంగా ఈ నెల 10 జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్)జిల్లాశాఖ ఓ ప్రకటనలో పిలుపునిచ్చింది. ఈ మేరకు ఉపాధ్యాయులందరూ డిమాండ్‌లతో కూడిన బ్యాడ్జీలను ధరించి బుధవారం విధులకు హాజరయ్యారు. ఇందులో భాగంగా యుటిఎఫ్ జిల్లా నాయకులు అల్లూరి శివవర్మ, డి.రాము, కె.శేషగిరిలు మాట్లాడుతూ డిమాండ్‌లతో కూడిన బ్యాడ్జీలు , కరపత్రాలు 10వేలకు పైగా యూటిఎఫ్ జిల్లా శాఖ విడుదల చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలపర్చాలని, ప్రైవేట్ భాగస్వామ్యం వద్దు అని, ప్రభుత్వ పెన్షన్ స్కీంను రక్షించాలని, విద్యాహక్కు చట్టంలో లోపాలను సవరించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలనే పలు అంశాలపై డిమాండ్ చేశారు.

వృద్ధాప్య పింఛన్ల నిలిపివేత సరికాదు

అనకాపల్లి, డిసెంబర్ 9 (న్యూస్‌లీడర్): వృద్ధాప్య పింఛన్లను మధ్యలో నిలుపుదలచేసి నిరుపేదలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని స్థానిక వయో వృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు (కెప్టెన్) ఒక ప్రకటనలో అన్నారు. అనకాపల్లి పట్టణంలో ఈసరికే పింఛన్లు పొందుతున్న కొందరు వృద్ధులకు 3, 4 మాసాల పాటు వాటిని అందజేసి తరువాత నిలుపుదల చేశారని ఆయన అన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు పింఛన్ల పాస్ పుస్తకాలను ఇచ్చినప్పటికీ వారికి పింఛను నిలుపుదలచేయడం శోచనీయమని అన్నారు. ఏఓ కుంటిసాగులు చెప్పి అడ్డంకులు కల్పిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా రేషన్‌కార్డుల్లో ఫోటోలు లేవని, రేషన్‌కార్డుల్లో వయసు తక్కువుగా ఉందని చెప్పి పింఛన్లను నిలుపుదల చేస్తున్నారని అన్నారు. 60 సంవత్సరాలు పైబడి ఉన్న వృద్ధులకు కూడా పింఛన్లు నిలుపుదలచేసిన సంఘటనలు ఉన్నాయని అన్నారు. ఈ పద్ధతిని ప్రభుత్వం మార్చుకోవాలని కెప్టెన్ విజ్ఞప్తి చేశారు.

లీడర్ జాతీయం

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బాలకృష్ణన్‌కు అస్వస్థత!

న్యూఢిల్లీ: భారత సర్వోన్నత న్యాయస్థానం కె.బాలకృష్ణన్ బుధవారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. కడుపునొప్పి రావడంతో ఆయనను ఆసుపత్రికి తరలించినట్టు కోర్టు వర్గాలు వెల్లడించాయి. 64 సంవత్సరాల చీఫ్ జస్టిస్ మంగళవారం సాయంత్రం నుంచి కొద్దిగా అనారోగ్యంగానే ఉన్నారు. దీంతో ఆయనను ఆసుపత్రికి తరలించినట్టు ఆ వర్గాలు తెలిపాయి. అనారోగ్యం కారణంగా బాలకృష్ణన్ బుధవారం కోర్టు విధులకు హాజరుకావడం లేదని కోర్టు వర్గాలు పేర్కొన్నాయి. కాగా, కలుషిత ఆహారం తీసుకోవడం వల్లే బాలకృష్ణన్ అస్వస్థతకు గురైనట్టు ఆసుపత్రి వర్గాలు అనధికారంగా వెల్లడించాయి. ప్రాథమిక చికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం కుదుటపడినట్లు తెలిపాయి.

చిమ్మచీకట్లో హెలికాప్టర్ ల్యాండింగ్

డీజీసీఏ విచారణ!

పాట్నా: ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పర్యటనలో ఉన్న కాంగ్రెస్ పార్టీ యువనేత రాహుల్ గాంధీ వివాదంలో చిక్కుకున్నారు. తాను ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను చిమ్మచీకట్లో ల్యాండింగ్ చేయించారు. పైలట్‌ను బలవంతం చేసి ఈ పని చేయించారని ఉత్తరప్రదేశ్‌లోని మాయావతి సర్కారు ఆరోపిస్తోంది. దీనిపై డీజీసీఏ విచారణకు ఆదేశించింది. అలాగే, సీతాపూర్ జిల్లా కలెక్టర్ నుంచి వివరణ కూడా కోరింది. అయితే, అనధికార వర్గాల సమాచారం మేరకు...సీతాపూర్ జిల్లా యంత్రాంగం స్పందించినట్టు వినికిడి. జీరో విజబులిటీలో రాహుల్ హెలికాప్టర్ ల్యాండ్ అయిందని ప్రభుత్వానికి సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి త్వరలోనే హెలికాప్టర్ ఇద్దరు పైలట్ల వాంగ్మూలాన్ని త్వరలోనే నమోదు చేసే అవకాశాలు లేక పోలేదు. విజన్ యూపీ-2012ను ప్రవేశపెట్టిన రాహుల్ గాంధీ.. ఆ రాష్ట్రంలోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్న విషయం తెల్సిందే. అయితే, రాహుల్ హెలికాప్టర్ వివాదాన్ని స్వయానా సొంత పార్టీకి చెందిన వారే లేవదీయడం గమనార్హం. ఇదిలావుండగా, కొందరు విలేకరులు అడిగిన ప్రశ్నకు రాహుల్ గాంధీ సమాధానం ఇస్తూ తన పెళ్లికి మరో రెండు సంవత్సరాలు ఆగాల్సిందేనన్నారు. 2012లో తాను పెళ్లి చేసుకుంటానని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోనే తన వివాహం జరుగుతుందన్నారు. యువజనులను రాజకీయాల్లోకి రావాలని ఆయన మరోమారు పిలుపునిచ్చారు.

పక్కా ప్రణాళికతోనే

బాబ్రీ కూల్చివేత : చిదంబరం

న్యూఢిల్లీ : అయోధ్యలోనే పురాతన బాబ్రీ మసదును పక్కా ప్రణాళికతోనే భారతీయ జనతా పార్టీ కూల్చివేసిందని కేంద్ర హోం మంత్రి పి. చిదంబరం ఆరోపించారు. బాబ్రీ మసీదు అంశంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టుకు ఇచ్చిన హామీతో పాటు.. ప్రధాని పి.వి. నరసింహారావుకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని ఆయన ధ్వజమెత్తారు. బాబ్రీ మసీదు విధ్వంసంపై విచారణ జరిపిన లిబర్హాన్ కమిషన్ కేంద్రానికి సమర్పించిన నివేదికపై ప్రస్తుతం పార్లమెంట్‌లో చర్చ సాగుతోంది. ఈ చర్చలో పాల్గొన్న భాజాపా నేత సుష్మా స్వరాజ్ లిబర్హాన్ కమిషన్‌ను ఒక తప్పుల తడక నివేదికగా, కాంగ్రెస్ కరపత్రంగా అభివర్ణించారు. ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలకు కేంద్ర హోంమంత్రి చిదరంబరం మంగళవారం సమాధానం ఇచ్చారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని పి.వి.నరసింహారావు కమలనాథులను నమ్మడం వల్లే ఈ ఘోరం జరిగిందన్నారు. ప్రధాని తన రాజకీయ జీవితంలో చేసిన తప్పుగా ఆయన అభివర్ణించారు. కరసేవ విషయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వానికి, సుప్రీం కోర్టుకు ఇచ్చిన హామీలను యుపీలోని భారతీయ జనతా పార్టీ సర్కారు నిలుపుకోలేక పోయిందన్నారు. అప్పటి పీవీ ప్రభుత్వం భాజాపా నమ్మి పెద్దతప్పు చేసిందని చిదంబరం వ్యాఖ్యానించారు. హోంమంత్రి వ్యాఖ్యలకు నిరసన తెలియచేందుకు భాజాపా సభ్యులు విఫలయత్నం చేశారు. 1992 డిసెంబర్ 6వ తేదీన అయోధ్యలో కరసేవకులు ఏం చేసిందీ పూర్తి సమాచారం ప్రతిపక్ష నేత అద్వానీ వద్ద వుందని, సంఘ్ పరివార్ సభ్యులు బాబ్రీమసీదును కూలగొట్టే ఉద్దేశంతోనే అయోధ్యకు వెళ్లారని చిదంబరం విమర్శించారు. ఈ కూల్చివేత వ్యవహారమంత ఆర్ఎస్ఎస్ ఆధీనంలోనే జరిగిందన్నారు. అంతే కాకుండా, కూల్చివేతకు సంబంధించిన ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవడం వల్లే సుత్తి, ఉలి, ఇనుప కమ్ములు, లాఠీలను కరసేవకులు అయోధ్యకు పట్టుకెళ్లారని చిదరంబరం ఆరోపించారు.

ఆత్మవిశ్వాసంతోనే

ముందడుగు

విజయనగరం, డిసెంబర్ 9(న్యూస్‌లీడర్): అంగవైకల్యాన్ని అధిగమిస్తూ మనోస్థైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ బెల్లాన చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఇక్కడి ఆనందగజపతి ఆడిటోరియంలో వికలాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యాన జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వికలాంగులను ఆదుకునేందుకు, వారికి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ చేపడుతుందని, రిజర్వేషన్లను కూడా కల్పిస్తోందని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి 68 మంది వికలాంగులకు వివిధ వస్తు సామగ్రిని అందజేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రేమసమాజం అధ్యక్షుడు బుచ్చిబాబు మాట్లాడుతూ వికలాంగులను, ముఖ్యంగా బాలలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పట్టణంలోని పేర్ల సత్తయ్య శెట్టి పాఠశాలలో వికలాంగులకు కేంద్ర ప్రభుత్వ సాయం అందనందున దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని, బాలలను దత్తత తీసుకుని, వారికి అయ్యే ఖర్చును భరించాలని కోరారు. కార్యక్రమంలో వికలాంగ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంగవైకల్యాన్ని లెక్కచేయకుండా ఉన్నత హోదాలకు చేరుకున్న ఎందరో ప్రముఖులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. శిశువు గర్భంలో ఉండగానే అంగవైకల్యం రాకుండా తగు జాగ్రత్తలు వహించాలని, ఒకవేళ ప్రసవం తరువాత అంగవైకల్యం కనిపించినా తక్షణమే తగు వైద్యసేవలు అందిస్తే ఫలితం ఉంటుందన్నారు. 40 మందికి ట్రైసైకిళ్ళు, ఆరుగురికి వీల్ చైర్‌లు, నలుగురికి వినికిడి యంత్రాలు, 18 మందికి కృత్రిమ అవయవాలను అందిస్తున్నామని, లక్షా 75వేల రూపాయిలు వీటికోసం ఖర్చుచేసామని చెప్పారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాబర్ట్స్, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లాలోని వివిధ వికలాంగ పాఠశాలలకు చెందిన బాలలు ప్రదర్శనగా తరలివచ్చారు.